
సాక్షి గుంటూరు

సోమవారం । 26 । ఆగస్టు । 2024



మండల్ జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,076 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఐశ్వర్య ప్రదాయినిగా బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకుని అమ్మవారిని ఐశ్వర్య ప్రదాయినిగా అలంకరించారు.



తక్షణమే శిక్ష విధించేలా చట్టాలు ఉండాలి

వైద్యులకు ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలి. దీనికి ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడటం స్వాగతించదగిన విషయం. విధులు నిర్వర్తించే ప్రదేశంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి. కోల్‌కతా ఘటన అత్యంత అమానుషం. అలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటివి జరిగినప్పుడు స్పందించడం, తర్వాత సైలెంట్ కావడం తగదు. తప్పు చేసిన వారికి వెంటనే శిక్ష విధించేలా ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ మౌనిక రెడ్డి, ఎండీ జనరల్ మెడిసిన్, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రత్తిపాడు



పని గంటలు తగ్గించడం అవసరం



వైద్యశాలలో పనిచేసే వైద్యులు, సిబ్బందికి చాలా ప్రాంతాల్లో ప్రత్యేక గదులు ఉండవు. టాయిలెట్‌కు కూడా వేరే చోటుకు వెళ్లాల్సిన పరిస్థితి. మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. అలాగే 36 గంటలు విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. దీనివల్ల అలసట ఎక్కువై, అనేక ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. భద్రతాపరంగా కూడా ప్రభుత్వాలు దీనిపై ఆలోచించాలి. పని గంటలను తగ్గించాలి.

– డాక్టర్ గీతిక, పీజీ విద్యార్థిని, తెనాలి

న్యూస్‌రీల్

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం మహారాష్ట్రలో ప్రధాని మోదీ లఖ్‌పతి దీదీ పథకాన్ని ఆరంభించిన నేపథ్యంలో కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో కలెక్టర్‌తోపాటు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, లబ్ధిదారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన 38,155 మందికి రూ.38 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయన్నారు. మహిళలు కనీసం ఏడాదికి రూ.లక్ష సంపాదించే స్థాయికి చేరాలని కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులతోపాటు పత్రాలను అందించారు.

తెనాలి సబ్ కలెక్టర్‌గా సంజనా సింహ



తెనాలి: తెనాలి సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారిణి వి.సంజనా సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ప్రఖర్‌జైన్ పాడేరు సబ్ కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎనిమిది మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. వారిలో సంజనా సింహ ఒకరు. సంజనా సింహ 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఐఐటీ- ఖరగ్‌పూర్‌లో బీటెక్ చేశారు. సివిల్స్‌లో మూడో పర్యాయం 201 ర్యాంకుతో ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. నాలుగో ప్రయత్నంలో అత్యుత్తమ ప్రదర్శనతో 37వ ర్యాంకు సాధించారు. తాను కలలుగన్న ఐఏఎస్‌ను అందుకున్నారు. నెల్లూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నాక, ఆమెను విద్యుత్ మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమించారు.

నేడు పోలీస్ 'స్పందన' రద్దు

నగరంపాలెం: ఈ నెల 26న కృష్ణాష్టమి పండుగ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' తాత్కాలికంగా రద్దు అయింది. ఈ మేరకు డీపీఓ కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులు ఈ విషయం గమనించాలని పేర్కొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా రవి నియామకం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మెల్లెంపూడి రవిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఉత్తర్వులు అందజేశారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. జిల్లా జట్లు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు వినయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశ్వరరావు, టి. వెంకటేశ్వరరావు, రమేష్, రజిని నాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.

విదేశీయుల సమాచారం అందించాలి

ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: చదువు, ఉద్యోగాలు, టూరిజం ప్రదేశాల సందర్శన, బంధువులను చూసేందుకు, వైద్య చికిత్స వంటి వాటి కోసం విదేశీయులు జిల్లాకు వస్తున్నారని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. వారికి వసతి కల్పించే హోటల్, అతిథిగృహం, ధర్మశాల, విశ్వవిద్యాలయం, ఆసుపత్రి, ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సదరు వివరాలను indianfrso.gov.in/frso/gormC వెబ్‌సైట్ ద్వారా 24 గంటల్లోపు ఫారం–సిలో రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. సందేహాలు ఉంటే ఫోను నంబర్లు 0863–2233351, 2233352లో సంప్రదించాలని అన్నారు. సామాన్య ప్రజలు కూడా 100కు ఫోను చేయొచ్చన్నారు.

జ్వరం సలసల.. జనం విలవిల



- అధ్వాన పారిశుద్ధ్యంతో ప్రజలపై దోమల దాడి
- మొద్దునిద్ర పోతున్న అధికార యంత్రాంగం
- అన్ని నియోజకవర్గాల్లోనూ భారీగా జ్వరపీడితులు
- వైద్యశాలలకు పరుగులు తీస్తున్న రోగులు
- చికిత్స ఖర్చులతో చితికిపోతున్న కుటుంబాలు

విజృంభిస్తున్న జ్వరాలతో జిల్లా ప్రజలు గజగజలాడుతున్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి మొదలు ఏ చిన్న వైద్యశాల చూసినా.. చివరికి ఆర్ఎంపీ వంటి వారి వద్ద కూడా పెద్ద క్యూ కనిపిస్తోంది. దీన్ని బట్టి జిల్లాలో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇటు పరీక్షలు, వైద్యచికిత్సల ఖర్చులతో పేద, మధ్యతరగతి వారికి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. యంత్రాంగాన్ని నడిపించాల్సిన ప్రభుత్వానికి కనీసం 'దోమ' కుట్టినట్టైనా లేదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయడం సంగతి దేవుడెరుగు.. పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాలువలను శుభ్రం చేయించడం కూడా అధికారులు మరిచిపోయారు. దోమల దాడితో జిల్లా ప్రజలు గజగజలాడుతూ నరకం చూస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు మెడికల్: వైద్య రంగంలో రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరున్న గుంటూరు జిల్లాలో ప్రజలు ప్రస్తుతం జ్వరాలతో అల్లాడిపోతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేదు.. చిన్నపిల్లలు, పెద్దవారు అనే భేదం లేదు.. ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఎక్కడ చూసినా రోగులు కిటకిటలాడుతున్నారు. జిల్లాలోని ఎక్కువ ప్రాంతాలలో పారిశుద్ధలోపం, కాల్వల్లో మురుగు నీరు నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజల జ్వరాలబారిన పడాల్సి వస్తోంది. వ్యాధులు రాకుండా అవగాహన కల్పించి ప్రాథమిక దశలోనే కట్టడి చేయాల్సిన యంత్రాంగం వైఫల్యం చెందింది. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య ఆరోగ్యశాఖ విభాగాల మధ్య సమన్వయ లోపమే ప్రజలకు శాపంగా మారింది. ప్రభుత్వపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయిలోనూ ఆ ప్రభావం పడి అంతిమంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రుల ఖర్చుల భారం భరించలేకపోతున్నారు. డెంగీ జ్వరాలు సోకిన వారికి వైద్యం చేయించాలంటే రూ.లక్షల్లోనే బిల్లులు అవుతున్నాయి. ప్లేట్‌లెట్స్ పేరిట ప్రైవేటు ఆస్పత్రుల వారు రోగుల నుంచి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో చేబ్రోలు మండలంలో డెంగీ లక్షణాలతో చికిత్స పొందుతూ తాతయ్య (65), తాడిబోయిన కృష్ణకుమారి (52), మేడికొండూరు మండలంలో ఒకరు మరణించారు.



గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులు

అన్ని నియోజకవర్గాల్లోనూ బాధితులు

- గుంటూరు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని ఆస్పత్రుల్లో జ్వరపీడితులు ఎక్కువగా చికిత్స పొందుతున్నారు. గుంటూరు తూర్పు పరిధిలోని గుంటూరువారి తోట, ఐపీడీ కాలనీ, ఇజ్రాయేల్ పేట, లాంచెస్టర్ రోడ్, లాలాపేట, ఎల్‌బీ నగర్, సుద్దపల్లి డొంక, రాజీవ్‌గాంధీ నగర్, మంగళదాస్ నగర్, గోరంట్ల, ఏటుకూరు, బొంగరాల బీడు తదితర ప్రాంతాల్లో కేసులు అధికంగా ఉన్నాయి.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అడవితక్కెళ్లపాడు, బృందావన్ గార్డెన్స్, మల్లికార్జున పేట, మారుతీనగర్, నల్లపాడు, శారదా కాలనీ, రెడ్డిపాలెం, గుండారావుపేట, ఆర్.అగ్రహారం, శ్రీనివాసరావుతోట, చౌడవరం తదితర ప్రాంతాల్లో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జ్వర పీడితులు ఉన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, పీహెచ్‌సీలతోపాటు ఆర్ఎంపీ వద్ద కూడా రోగులు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వేలు చేస్తున్నారు. ఇంటికొకరు జ్వరం బారిన పడినట్లు తేలుతోంది.
- తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు మండలం పెదపరిమి, అనంతవరం, తాడికొండ మండలం లాం గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. ఇప్పటివరకు మొత్తం నాలుగు కేసులు వెలుగుచూశాయి. మేడికొండూరు మండలంలో డెంగీతో ఒకరు మృతి చెందారు. అన్ని గ్రామాల్లో జ్వర బాధితులు ఉన్నారు. వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులే బాధితుల్లో ఎక్కువగా ఉంటున్నారు.

సంవత్సరం	డెంగీ కేసులు	మలేరియా కేసులు
2021	447	--
2022	168	24
2023	375	21
2024 (జూలై వరకు)	152	05

- మంగళగిరి నియోజకవర్గంలో ఉండవల్లి సెంటర్‌లో ఒక డెంగీ కేసు నమోదైంది. తుమ్మపూడిలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. జ్వర పీడితులకు వైద్య, రక్త పరీక్షలు చేశారు.
- తెనాలి నియోజకవర్గంలో వంద మందికిపైగా జిల్లా వైద్యశాలలో జ్వరానికి చికిత్స పొందుతున్నారు. వారం రోజులుగా ఈ తరహా ఇబ్బందులతో వచ్చేవారు ఎక్కువ అయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటమే కారణమని తెలుస్తోంది.
- పొన్నూరు నియోజకవర్గంలోని పొన్నూరు పట్టణంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. అన్ని గ్రామాల్లో సాధారణ జ్వర పీడితులు ఉన్నారు.



తెనాలి హాస్పిటల్‌లో పరిస్థితి ఇదీ...

అతిసారం

వర్షాకాలం నేపథ్యంలో కలుషిత నీరు, ఆహారం వల్ల అతిసారం వస్తుంది. రోజూ జిల్లావ్యాప్తంగా 20 నుంచి 30 కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి.

చికెన్‌గున్యా

జిల్లాలో మూడేళ్లుగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు. 2013లో బాధితులు అధిక సంఖ్యలో నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎమర్జన్సీ సైతం ప్రకటించింది.

ఫైలేరియా

జిల్లాలో 1,400 మంది బాధితులు ఉన్నారు. ఏడేళ్లుగా జిల్లాలో కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు.

మెదడువాపు

ఇది ఎక్కువగా 15 ఏళ్లలోపు పిల్లలకు వస్తుంది. చిన్నప్పుడే వ్యాక్సిన్ వేయిస్తే వచ్చే అవకాశం తక్కువ. జిల్లాలో మూడేళ్లుగా కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు.



అమరావతి రహదారిలో గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. పారిశుద్ధ్యలోపమే కారణమని సర్వేలో వెల్లడవుతోంది. జిల్లాలో నమోదైన జ్వరాల కేసుల వివరాలు పట్టికలో చూడొచ్చు.

'మాయల ఫకీరు' మనోడే!

మంచి నాటకం ప్రేక్షకులను మైమరిపిస్తుంది.. అందులోని పాత్రలు మంత్రముగ్ధుల్ని చేస్తాయి.. అలాంటి ఓ పాత్రకు జీవం పోసి కలకాలం ప్రజల మనస్సులో ఉండేలా చేసిన వైవిధ్య నటుడు తెనాలి ప్రాంతానికి చెందిన వల్లూరు వెంకట్రామయ్య చౌదరి. 'బాల నాగమ్మ' నాటకంలో మాయల ఫకీరు పాత్రకు ప్రాణం పోసిన ఆయన.. నేడు మన మధ్యలేకున్నా తన నటనాకౌశల్యంతో వైవిధ్య పాత్రలు పోషించిన కీర్తిని చిరస్థాయిగా నిలుపుకొన్నారు. నటనే సర్వస్వంగా భావించిన ఆయన తుదిశ్వాస కూడా నాటకం ముగిసిన కాసేపటికే విడిచారు. శత జయంతి సంవత్సరం సందర్భంగా ఆయన్ను స్మరిస్తూ అందిస్తున్న ప్రత్యేక కథనమిది.



వెంకట్రామయ్య చౌదరి

పాత్ర.. కీర్తి.. అజరామరం

- మాయల ఫకీరుకు మారుపేరుగా నిలిచిన వల్లూరు వెంకట్రామయ్య
- ఆయన నటనతో 'బాల నాగమ్మ' నాటకంలోని పాత్రకు గుర్తింపు
- వైవిధ్య పాత్రల్లో అలవోకగా ఒదిగిపోయిన తెనాలి ఆణిముత్యం
- శత జయంతి సంవత్సరం సందర్భంగా స్మరిస్తూ ప్రత్యేక కథనం

తెనాలి: బాలనాగమ్మ నాటకం అనగానే మాయల ఫకీరు... ఆ పాత్రలో వల్లూరు వెంకట్రామయ్య చౌదరి ఒదిగిపోయే తీరు గుర్తుకొస్తాయి. ప్రత్యేకమైన ఆహార్యం, ప్రళయగర్జన అన్నంత వికటాట్టహాసం, హేళనతో కూడిన పరిహాసం, శృంగారం, అహంభావాన్ని అలవోకగా పండించే సంభాషణలు, హావభావాలతో వెంకట్రామయ్య ఆ పాత్రను అజరామరం చేశారు. ప్రదర్శనకు ముందే గర్భిణులు, చిన్నపిల్లలు చూడొద్దంటూ నిర్వాహకులు హెచ్చరించే వారంటే ఆ పాత్రను ఆయన ఏ స్థాయిలో రక్తికట్టించేవారో అర్థం చేసుకోవచ్చు.

పాఠశాల స్థాయి నుంచే...

వల్లూరు వెంకట్రామయ్య చౌదరి స్వస్థలం తెనాలి సమీపంలోని కళల నిలయమైన కొలకలూరు గ్రామం. తల్లిదండ్రులు అంజయ్య, సౌభాగ్యమ్మ. 1925 మే 11న ఆయన జన్మించారు. హైస్కూలు రోజుల్లో ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో వార్షికోత్సవంలో దుర్యోధనుడి వేషం కట్టారు. తర్వాత నాటకమే ఆయన జీవితమైంది. 9వ తరగతితోనే చదువు ఆగిపోయింది. ప్రఖ్యాత నటుడు స్థానం నరసింహారావు ఆయన్ను గుర్తించారు. శ్రీకృష్ణ దేవరాయలు నాటకంలో గణపతి వేషం ఇచ్చారు. మాధవపెద్ది వెంకట్రామయ్య దర్శకత్వంలో రాణీరుద్రమ నాటకంలో హరిహర దేవుడి పాత్రను పోషించే అవకాశం వచ్చింది. కాంట్రాక్టు నాటక సమాజాలపై విసుగెత్తి 1950లో సహనటులతో కలిసి 'ఆంధ్ర డ్రమెటిక్ అమెచ్యూర్స్' సంస్థను ఆయన స్థాపించారు. ఆ సంస్థ పేరుతో బాల నాగమ్మ నాటకంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించారు. దేశవ్యాప్తంగా మూడు వేలకుపైగా ప్రదర్శనలిచ్చారు. త్రిపురనేని సూతపురాణం ఆధారంగా వచ్చిన 'రామరావణ యుద్ధం' నాటకాన్ని వెయ్యికిపైగా సార్లు ప్రదర్శించారు. మోదుకూరి జాన్సన్ రచించిన 'దేవాలయం' నాటకాన్ని పలు పరిషత్తులలో ప్రదర్శించి, ఉత్తమ నటుడు బహుమతిని కూడా కైవసం చేసుకున్నారు. జైభవానీ, కృష్ణ జాంబవంత, రంగూన్ రౌడీ, కష్టజీవి, కట్టె బొమ్మన, భక్త శబరి వంటి నాటకాల్లోనూ ఒదిగిపోయారు. సినిమాలలో అవకాశం వచ్చినా, తల్లి సౌభాగ్యమ్మ కోరిక మేరకు నటించలేదు. వెంకట్రామయ్య ప్రదర్శించిన అన్ని నాటకాలకు దాదాపుగా ప్రముఖ నటి రామకుమారి దర్శకులుగా ఉన్నారు. తన సమాజం ప్రదర్శించే నాటకాలకు ఇతరులను దర్శకులను నియమించేవారు వెంకట్రామయ్య. జైభవాని నాటకానికి మొక్కపాటి కృష్ణమోహన్, రామరావణ యుద్ధం నాటకానికి గుమ్మడి కుటుంబరావు దర్శకులుగా వ్యవహరించారు. ఏవీ సుబ్బారావు, బండారు రామారావు, రేబాల రమణ, నూతక్కి సుబ్బారావు, ఆకుల వెంకయ్య, డీవీ సుబ్బారావు (జూనియర్), కాళిదాసు కోటేశ్వరరావు, లక్ష్మీకాంతం, రామకుమారి, శకుంతల, ఇందిర వంటి సహనటులు వల్లూరు నాటక సమాజంలో కీలకంగా ఉండేవారు. బాల నాగమ్మ నాటకంలో కార్యవర్ధిరాజు పాత్రలో డీవీ సుబ్బారావు (జూనియర్)ను రంగస్థలానికి పరిచయం చేశారు.

వీరవిహారమే...

ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. రంగస్థలంపై వీరవిహారం చేశారు. చింతామణిలో భవానీ శంకరుడు, సక్కుబాయిలో శ్రీకృష్ణుడు, హరిశ్చంద్రలో నక్షత్రకుడు, రామాంజనేయ యుద్ధంలో యయాతి, శ్రీకృష్ణ రాయబారంలో దుర్యోధనుడు, తెలుగు తల్లిలో తిక్కన, కురుక్షేత్రంలో కర్ణుడు పాత్రల్లో నటించారు. ఒక పర్యాయం బాలనాగమ్మ నాటకంలో మాయల ఫకీరు పాత్రధారి గైర్హాజరయ్యారు. మాస్టర్ శ్రీరాములు సూచన మేరకు వెంకట్రామయ్య ఆ పాత్ర పోషించారు. ప్రేక్షకులు ఎంతో మెచ్చారు. ప్రత్యేకమైన సాధనతో మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకున్నారు.

వందల సత్కారాలు

నటుడు, దర్శకుడు, నాటక సమాజ నిర్వాహకుడిగా వెంకట్రామయ్య వందల సత్కారాలు పొందారు. బళ్లారి రాఘవ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి జ్ఞానీజైల్‌సింగ్, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుల చేతుల మీదుగా కూడా సన్మానాలు పొందారు. 1968 మే 22న తెనాలిలో స్థానం ఆధ్వర్యంలో 'నటసార్వభౌమ' పురస్కారాన్ని స్వీకరించారు. 1990 డిసెంబరు 9న కృష్ణా జిల్లా గుడివాడలో బాల నాగమ్మ నాటకాన్ని ప్రదర్శించిన అనంతరం, మేకప్ తీసేసి సహనటులతో పిచ్చాపాటి మాట్లాడుతుండగా గుండెపోటు రావటంతో కన్నుమూశారు.



జ్ఞానీజైల్‌సింగ్ చేతుల మీదుగా సన్మానం

తెలుగు భాషోద్యమానికి గిడుగు విశేష కృషి



కవులను సన్మానించిన కొండవీటి రచయితల సంఘం ప్రతినిధులు

ఫిరంగిపురం: తెలుగు భాషోద్యమానికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆచార్యులు బూసి వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి కళ్యాణమండపంలో ఆదివారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కొండవీటి రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 70 మంది కవులు తమ కవితలు వినిపించారు. ముఖ్యఅతిథిగా వెంకటస్వామి మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కొండవీడు విద్యాశాఖాధికారిగా కవిసార్వభౌముడు శ్రీనాథుడిని అప్పటి రెడ్డి రాజులు నియమించారని గుర్తుచేశారు. ఆయన రాసిన ఎన్నో పద్యాలు ప్రజలకు అత్యంత చేరువయ్యాయని చెప్పారు. కొండవీడు రచయితల సంఘం కార్యకలాపాలు అభినందనీయం అన్నారు. గుర్రం జాషువా కళా పరిషత్ స్థాపకుడు, సాహితీవేత్త యోహాను మాట్లాడుతూ.. యువ కవులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అనంతరం బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన సొపాటి ప్రభాకర్ రచించిన ప్రభాతాక్షరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులను శాలువాలతో సన్మానించారు. ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కొండవీటి రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి తొళ్లమడుగు గోవిందయ్య, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, షేక్.ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.





రారా.. కృష్ణయ్యా..

శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో ఆదివారం జిల్లాలోని పలు చోట్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో కనువిందు చేశారు. తమ ముద్దులొలికే మాటలు, చేతలతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే పోటీలు కూడా ఉత్సాహంగా సాగాయి.

క్లుప్తంగా

బడిలో ముగ్గురు విద్యార్థులు.. ఒక్కరే ఉపాధ్యాయుడు!



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకప్పుడు సుమారు పాతిక మంది విద్యార్థులు ఉండేవారు. కొన్నాళ్ల క్రితం తల్లిదండ్రులు ఈ పరిస్థితి మారాలని తమ పిల్లలను చేర్పించారు. తర్వాత విద్యాశాఖ నిర్లక్ష్యంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పుడు ఒకటి, మూడు, నాలుగు తరగతులలో ఒకరు చొప్పున విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్‌గా వచ్చేది ఇద్దరు విద్యార్థులే. వారే ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలు బోధిస్తుంటారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మేడికొండూరు: గుంటూరు జిల్లా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ అయిన అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ జిల్లా స్థాయి సమావేశాన్ని మేడికొండూరు గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టేట్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శివ సూర్య తేజ హాజరయ్యారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా తెల్లమేకల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా జాన్ వెస్లీ, ట్రెజరర్‌గా అశోక్ బాబు, ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు తగదు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్



లక్ష్మీపురం: విద్యుత్తు స్మార్ట్ మీటర్ల పేరిట రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం పెనుభారాన్ని మోపే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీనికి సంబంధించి గత ప్రభుత్వం హయాంలోనే టెండర్లు కొందరు దక్కించుకుంటే ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పూర్తిగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం తగదన్నారు. దీనివల్ల వినియోగదారులపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్ మాఫియాను నియంత్రించాలి



డ్రగ్స్ మాఫియా వేళ్లూనుకున్న చోట కోల్‌కతా లాంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఈ ఘటన చాలా బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడిచినా అప్పటి సౌకర్యాలే మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో ఉన్నాయి. జనాభాకు తగ్గట్లుగా డాక్టర్లు పెరుగుతున్నా ఆస్పత్రుల్లో వారికి సౌకర్యాలు మాత్రం పెరగట్లేదు. ముఖ్యంగా భద్రతతో పాటు రక్షణ కల్పించాలి. పోలీసుల కాపలా, సీసీ కెమెరాలు, రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటుచేయాలి. చట్టాలు పకడ్బందీగా అమలుకావాలి. వీటిపై పాలకులు దృష్టి సారించాలి.

–డాక్టర్ రాంప్రసాద్, అశ్విని లేబరేటరి, నరసరావుపేట



24 గంటలూ పోలీసుల రక్షణ ఉండాలి

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో 24 గంటలు పోలీసు రక్షణ ఉండాలి. ఆ సౌకర్యం ఉంటే డాక్టర్లు స్వేచ్ఛగా వైద్యం అందించగలుగుతారు. పోలీసులు ఉంటే పేషెంట్లు, వారి బంధువులకు ఒక హెచ్చరికగా ఉంటుంది. ఇతర వ్యక్తులు లోపలికి వచ్చేందుకు సంకోచిస్తారు. పనిచేసి విశ్రాంతి తీసుకుందామనుకునే డాక్టర్లకు రెస్ట్‌రూమ్‌లు, సరైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అప్పుడే ప్రజలకు సక్రమంగా వైద్యం లభిస్తుంది.

–డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈఎన్‌టీ వైద్యుడు, నరసరావుపేట



విత్తన శుద్ధి.. లాభాల వృద్ధి!

- తగిన పద్ధతి పాటిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం
- వ్యయ నియంత్రణతోపాటు పెరగనున్న దిగుబడి

కొరిటిపాడు(గుంటూరు): పంటల సంరక్షణలో మేలైన ప్రక్రియ విత్తనశుద్ధి. దీనివల్ల తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు. భూమిని దున్నడం ఎంత ముఖ్యమో శుద్ధి చేసిన విత్తనాన్ని వాడటం అంతే ప్రధానం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి ఎంతో కీలకం. చీడపీడల ఉధృతి తగ్గించి, పంట దశలో ఆశించే రసం పీల్చే పురుగులు తదితరాల నుంచి పంటల్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



విత్తన శుద్ధిపై రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆదిలోనే అడ్డుకట్ట వేయాలంటే...

కోత కోసేటప్పుడు, నూర్పిడి జరిగేటప్పుడు కొన్ని శిలీంధ్ర భాగాలు విత్తనాలతో కలిసి పంటను ఆశిస్తాయి. విత్తనాలలో తెగుళ్లను కలుగజేసే సూక్ష్మక్రిములు బీజాల రూపంలో ఉండి తిరిగి విత్తనాలను నాటినప్పుడు చీడపీడల రూపంలో బయటపడతాయి. సాధారణంగా రైతులు పైరుకు తెగుళ్లు ఆశించినప్పుడు మాత్రమే శిలీంధ్ర రసాయనాలను పిచికారి చేస్తారు. తెగుళ్లను ప్రారంభ దశలోనే గమనించకపోవడం, సకాలంలో సస్యరక్షణ చేపట్టకపోవడం వల్ల నివారణ కష్టసాధ్యమవుతుంది. విత్తనం మంచిదైతేనే పంట బాగుంటుంది. కనిపించని శిలీంధ్రాల బారి నుంచి రక్షించుకోవాలంటే విత్తనశుద్ధి ఆవశ్యకత ఎంతో ఉంది. విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించడం.. మొలక దశలో నేలలో కీటకాలు, శిలీంధ్రాల నుంచి విత్తనాలను కాపాడుకోవడానికి చేపట్టే ప్రక్రియను విత్తన శుద్ధి అంటారు.

కలిగే ప్రయోజనాలివీ..

- విత్తనాలను ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు.
- భూమి, విత్తనాలలో ఉండే సూక్ష్మ క్రిముల నుంచి మొలకెత్తే విత్తనాలు, చిరుమొక్కలకు రక్షణ ఉంటుంది.
- మొలక శాతం పెరుగుతుంది.
- ఒకే రీతిలో మొక్కలు ఎదుగుతాయి.
- పప్పు జాతి పంటలలో ఎక్కువ కణుపులు రావడానికి తోడ్పడుతుంది.
- భూమిలోగానీ, మొక్కలకుగానీ మందు చల్లడం కంటే ఈ పద్ధతి మెరుగైనది.
- ప్రతికూల పరిస్థితులలో కూడా (గాలిలో తేమ శాతం తక్కువగా లేదా ఎక్కువగా ఉన్నప్పుడు కూడా) పంట ఒకే తీరులో ఉంటుంది.
- నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగులను సమర్థంగా నివారించడానికి దోహదపడుతుంది.
- మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలీంధ్రాలను నాశనం చేస్తాయి.

అనుసరించాల్సిన విధానం

కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజబ్ కలిపి శుద్ధి చేయాలి. మోతాదుకు మించితే విత్తన మొలక శాతం దెబ్బతింటుంది. జీవరసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి. గింజ పగలకుండా, పైపొర పోకుండా జాగ్రత్త తీసుకోవాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి వస్త్రం కట్టుకోవాలి.

మెరుగైన దిగుబడులు

ఈ ప్రక్రియ ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చు. చీడపీడలను ఎదుర్కొనే సామర్థ్యం మొక్కలకు వస్తుంది. ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది. నాణ్యమైన దిగుబడి సాధించడం వల్ల మార్కెట్‌లో ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే సాగు లాభసాటిగా మారుతుంది.

– నున్న వెంకటేశ్వర్లు, డీఏఓ, గుంటూరు జిల్లా

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- డీఎంకే ఎంపీ విల్సన్ డిమాండ్
- ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు

ప్రత్తిపాడు: బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని తమిళనాడు రాష్ట్రానికి చెందిన డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్ అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని గుంటూరులో ఆదివారం మండల సేన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అమరావతి రోడ్డులోని బీపీ మండల్ సర్కిల్‌లో ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండ్లమూడి గార్డెన్స్‌లో సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విల్సన్ మాట్లాడుతూ.. ఇప్పటికీ 1931 జనాభా లెక్కల దామాషా ప్రాతిపదికనే రిజర్వేషన్లు కొనసాగించటం దారుణమన్నారు. కేంద్రానికి ప్రస్తుత జనాభా ప్రాతిపదికన అమలు చేసే ఉద్దేశం లేక బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బీపీ మండల్ నివేదిక ప్రకారం 52 శాతం జనాభా కలిగిన బీసీలకు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా కేవలం 27 శాతానికే పరిమితం చేయటం తగదన్నారు. ఎవరూ డిమాండ్ చేయకుండానే అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీపీ మండల్ సేన అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కేసన శంకరరావు, దాసరి శివకుమార్, సీనియర్ న్యాయవాది వై. కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది వై. ఠాగూర్ యాదవ్, జిల్లా కోర్టు న్యాయవాది ప్రసాదరావు, రంగయ్య, కె సుబ్రమణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంకే ఎంపీ విల్సన్, సేన నాయకులు

ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు మేలు

తెనాలి: రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి నాణ్యమైన సాగువిధానాలతో ఉత్పత్తులను పెంచాలని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ (నారమ్) డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. వారు తమ ఉత్పత్తులను విలువను జోడించుకుని, బ్రాండ్‌ను ఏర్పరచుకుని మార్కెట్ లింకేజీతో అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. కొల్లిపరలో ఆదివారం శ్రేష్ఠ ఉత్పత్తిదారుల సంఘం కలెక్షన్ సెంటరులో సంఘ సభ్యులు, విజ్ఞాన్ వ్యవసాయ కళాశాల విద్యార్థినుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయ పరిశోధన, విద్యాశాఖ (డీఏఆర్ఈ)లో భాగమైన స్వయం ప్రతిపత్తి సంస్థ 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్' (ఐసీఏఆర్)లో దేశవ్యాప్తంగా 113 సంస్థలు పనిచేస్తున్నాయని శ్రీనివాసరావు చెప్పారు. ఇందులో హైదరాబాద్‌లోని 'నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్' (నారమ్) ఒకటిగా తెలిపారు. దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలందరూ ముందుగా 'నారమ్'లో చేరి, ఫౌండేషన్ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం వీరు దేశంలోని వివిధ వ్యవసాయ పరిశోధన సంస్థలు, 731 కృషి విజ్ఞాన కేంద్రాలు, 76 వ్యవసాయ విశ్వవిద్యాయాల్లో నియామకం అవుతారని చెప్పారు. శాస్త్రవేత్తలకు ఫౌండేషన్ కోర్సుతోపాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఏర్పాటు నుంచి పంటల మార్కెటింగ్ లింకేజ్ వరకు అన్ని అంశాల్లోనూ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా 60 వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) ఏర్పాటు లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను అందిస్తోందని చెప్పారు. కొన్ని ఎఫ్‌పీఓలు మధ్యలోనే కార్యకలాపాలను నిలిపి వేస్తున్నాయని తెలిపారు. దీని నివారణకు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు, సుస్థిర వ్యవసాయ విధానాలు, కొన్ని సీజన్లకే కాకుండా ఏడాది మొత్తం పంటలను రాబట్టటం, పంటలను విలువను జోడింపు, మార్కెటింగ్ లింకేజ్ ఏర్పాటు వంటి అంశాలను ఆయన విశదీకరించారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు వుయ్యూరు సాంబిరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్.నరేంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న సీహెచ్ శ్రీనివాసరావు

ప్రకృతి సాగు తీరు పరిశీలన

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ తన 40 ఎకరాలలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం కెనడా విద్యార్థి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులతో ముచ్చటించారు. అనంతరం నూతక్కి గ్రామంలో శ్రీ వాసవి దుర్గాంబ ప్రకృతి వ్యవసాయ ఎన్‌పీఎం షాపును సందర్శించారు. పెదకొండూరు గ్రామంలోని దిలీప్ పాటిస్తున్న ఏటీఎం ద్వారా ఆదాయ మార్గాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారి కె. రాజకుమారి, టీఎల్ జి. శ్రీనివాసరావు, ఎన్ఎఫ్ఏలు సతీష్, సుమ, జయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న కెనడా విద్యార్థి

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

రేపల్లె రూరల్: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రభుత్వ వైద్యశాల సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ఎ.మల్లికార్జునరావు వివరాల మేరకు ప్రభుత్వ వైద్యశాల కాంపౌండ్ గోడ వద్ద సుమారు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వృద్ధుడు మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుడు గత నాలుగు రోజులుగా సమీప ప్రదేశాలలో సంచరించినట్లు సమాచారం ఉందన్నారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. మృతుడు ఎర్ర రంగు బనియన్, ఆకుపచ్చ రంగు నిక్కరు ధరించి ఉన్నాడని చెప్పారు. గుర్తించినవారు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉన్న మృతదేహాన్ని తీసుకెళ్లాలని చెప్పారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రత్తిపాడు: తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. చలపతి కళాశాల సౌజన్యంతో ఆనంద్ చెస్ వింగ్స్, రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మోతడకలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి 255 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రానికి ఆరు రౌండ్లకుగాను 6 పాయింట్లతో షణ్ముఖ (హైదరాబాద్) మొదటి స్థానంలో, 5.5 పాయింట్లతో ధ్రువేష్ (గుంటూరు), జె.మల్లేశ్వరరావు (విజయవాడ), ఎం. శ్రీనివాసరెడ్డి (గుంటూరు)లు ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సుమన్, చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్‌వీ రామారావు, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం. గోపీనాథ్, అర్బిటర్స్ విజయ్‌కుమార్ అగర్వాల్, రామ్, కళాశాల సిబ్బంది నాదెండ్ల రామారావు, పీడీ భానుప్రకాష్, డి. రాము, అధ్యాపకులు దినేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న క్రీడాకారులు

రాజకీయ ప్రవేశంతోనే ఎన్టీఆర్‌కు భారతరత్న దూరం

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

నగరంపాలెం: రాజకీయాల్లోకి ఎన్టీఆర్ రాకపోయుంటే ఆయనకు భారతరత్న ఎప్పుడో వచ్చేదని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. పద్మశ్రీ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ 55 వసంతాల వేడుక ఆదివారం రాత్రి విద్యానగర్‌లోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకను ప్రారంభించారు. అసోసియేషన్ ఏర్పాటు, సేవా కార్యక్రమాలను రావిపాటి సత్యనారాయణ వివరించారు. ముఖ్యఅతిథిగా గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ.. రాజకీయాలు కలుషితం అయ్యాయని, యావత్ దేశానికి ఎన్టీఆర్ భారత రత్నమని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించడం వల్లే ఎన్టీఆర్ పద్మశ్రీతో ఆగిపోయారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయనకు దైవభక్తి, దేశభక్తి ఎక్కువని గుర్తుచేశారు. తెలుగు కోసం ప్రాణమిచ్చారని అన్నారు. అన్ని రకాల పాత్రలను పోషించారని, అన్నింటికీ న్యాయం చేసేవారని చెప్పారు. ఆయన నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ నటించిన చిత్రాలను ప్రస్తుత తరానికి చూయించాలని అన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైవీఎస్ చౌదరి, నరసింహారావు, అయ్యన్నపాత్రుడు, అశ్వనీదత్

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ యుగ పురుషుడని చెప్పారు. రామారావు రాజకీయాల్లోకి వస్తానంటే చాలామంది విమర్శించారని పేర్కొన్నారు. సమాజ సేవలో ముందుండేవారని తెలిపారు. నేటి తరానికి ఎన్టీఆర్ గురించి చెప్పాలన్నారు. తనకు రాజకీయ జీవితం ఎన్టీఆర్ చలువేనని పేర్కొన్నారు. సినీ నిర్మాత చలసాని అశ్వనీదత్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఎక్కడున్నా మన మధ్యనే ఉంటారన్నారు. శ్రీకృష్ణుడి మెడలోని వైజయంతీ మాలనే వైజయంతీ మూవీస్‌గా నామకరణం చేశారని చెప్పారు. సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తన దైవం అన్నారు. ఆయన వల్లే సినిమాల వైపు నడిచానని చెప్పారు. ఎన్టీఆర్ అందరికీ గర్వకారణమని తెలిపారు. అనంతరం అతిథులను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు సంగమేశ్వర రావు, సూర్యనారాయణ, ఆర్.సాంబశివరావు, మారుతీరావు, బి.రామకృష్ణ, సుందరంబాబు, సుబ్బారావు, అభిమానులు పాల్గొన్నారు.

జంబో బండి



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని కాజా టోల్ గేట్ వద్ద ఆదివారం ఓ భారీ వాహనం చూపరులను ఆకట్టుకుంది. తిరుచ్చి నుంచి హరియాణకు భారీ బాయిలర్‌తో ఈ వాహనం బయలుదేరింది. బాయిలర్‌ను మోస్తున్న ట్రాలీకి 136, దానిని తీసుకెళ్తున్న వాహనానికి 10 చొప్పున మొత్తం 146 టైర్లు ఉన్నాయి. ఆ మార్గాన వెళ్తున్న ప్రజలు ఆ వాహనం వద్ద ఆగి మరి ఆసక్తిగా తిలకించారు.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్,

పెండింగ్ చార్జీల విడుదలకు ఏఐఎస్ఎఫ్ డిమాండ్

28న రిలే నిరసన దీక్షకు నిర్ణయం

లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 28వ తేదీన రిలే నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్తపేటలో మల్లయ్య లింగంభవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాలుగా వసతిగృహ విద్యార్థులకు సామగ్రి పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. 2023 నవంబర్ నుండి మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేవారు. ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని కోడిగుడ్ల సత్రంలో ఉన్న సమీకృత సంక్షేమ హాస్టల్ భవనానికి రూ.కోటి కేటాయించి తక్షణమే పూర్తి చేయాలన్నారు. వచ్చిన విద్యార్థులకు వసతి కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గాసాయి, అజయ్, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవోపా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రతిభావంతులైన 220 మంది విద్యార్థులకు రూ.30 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ.. దానధర్మాలు చేయడంలో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు మాట్లాడుతూ.. జీవితంలో తల్లి, తండ్రి, గురువు, దైవాన్ని ఎన్నటికీ మరచిపోరాదని చెప్పారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, గుంటూరు నగర అధ్యక్షుడు కేవీ బ్రాహ్మం, ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు, మహిళా విభాగ చైర్మన్ నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపకార వేతనం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, గ్రంధి కాంతారావు